ఘనంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, తదితరులు

దుండిగల్, డిసెంబర్ 16 : దుండిగల్ గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అయ్యప్ప మాలధారులతో కలిసి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ శంకర్‌నాయక్, నిర్వాహకులు గుడి లక్ష్మణ్, నేతలు నాగరాజు, సుధాకర్‌రెడ్డి, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్ డివిజన్ పరిధి జయభారత్ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలంతా అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమారస్వామి, ప్రభాకర్, శివ రామకృష్ణ, రాజు, సాంబశివ, వెంకటేశ్వర్‌రావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్ , డిసెంబరు 16

యువగళానికి తరలిన ఐటీ ప్రొఫెషనల్స్

ఫోటో రైటప్: 16 ఎంపీఆర్ 105: టీడీపీ యువ నాయకుడు నారా లోకేశ్ విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న యువగళం కార్యక్రమానికి హైదర్‌నగర్ డివిజన్ మిత్ర హిల్స్ లింక్ రోడ్డు ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నుంచి తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో ఐటీ శ్రేణులు, అభిమానులు శనివారం తరలి వెళ్లారు. వారికి తేదేపా నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు జనార్దన్, జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్సరెడ్డి, ఎంఎల్‌సీ కంచర్ల శ్రీకాంత్, అమరావతి జేఏసీ కన్వీనర్ కే. శ్రీనివాస్, తేజస్వి, కొండయ్య చౌదరి పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు శుభాకాంక్షలు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 16 : కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యూనియన్ల నాయకులు, ప్రజలు శనివారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదేండ్లలో కోట్లాది రూపాయాల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

అధ్యాపకులు.. తల్లిదండ్రులు

విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 16: అధ్యాపకులు, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తే విద్యార్థులు ఉత్తమంగా ఎదుగుతారని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వర్సిటీలోని సీఎస్ఆర్ సెమినార్ హాల్‌లో తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులతో పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. సబ్జెక్టుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ప్రభుత్వం కల్పించిన అన్ని రకాల వసతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు అడిగిన పలు ప్రశ్నలకు అధ్యాపకులు సమాధానాలు చెప్పారు.

మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, సీఆర్‌సీ ఛైర్మన్ పార్వతి, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, హస్టల్ వార్డెన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

● మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 16: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించి కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లో ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. భూఆక్రమణలను సహించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చిన్న, పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు నగరంలో సునామీ, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, దిల్ సంస్థలకు స్థలాలను కేటాయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ స్థలాలపై భూకబ్జాదారుల కన్ను పడిందని, వారి ద్వారా అమాయక ప్రజలు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

కుత్బుల్లాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్

సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి : కార్పొరేటర్

అల్లాపూర్, డిసెంబర్ 16 : డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ సబీహాబేగం పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సఫ్తాకర్‌నగర్‌లో జరగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన సీసీరోడ్డు పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అస్మ, సలీ, షాహెద్, తదితరులు పాల్గొన్నారు.

సఫ్తాకర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు స్పందన

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 16 : కుత్బుల్లాపూర్ విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ, సీజీఆర్ఎప్ బృందానికి వినియోగదారులు తమ దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈలు రెడ్డి, చైతన్య భార్గవ్, జ్ఞానేశ్, వినాయక్ రాథోడ్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ విద్యుత్ సబ్‌డివిజనల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్, డిసెంబర్ 16 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలు, బస్తీల ప్రజలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు శంభీపూర్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 16 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వారాంతపు సెలవు దినం కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.